www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
పశ్చిమ గోదావరి

జాతీయ పోటీలకు భారతీయ విద్యాభవన్స్ విద్యార్థి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జాతీయస్థాయి హాకీ పోటీలకు దిరిశాల కార్తీక్ సాయి ప్రకాష్ ఎంపికయ్యారు. స్థానిక భారతీయ విద్యాభవన్స్ స్కూలుకు చెందిన విద్యార్థి సాయి ప్రకాష్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరఫున రాష్ట్రస్థాయిలో చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరిగిన హాకీ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో మన రాష్ట్రం తరఫున ఆయన పాల్గొననున్నారని స్కూల్ హాకీ కోచ్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో అకడమిక్ డైరెక్టర్ మంతెన రఘువరదాసు, వైస్ ప్రిన్సిపల్ దేవీప్రసాద్, విద్యార్థి తండ్రి దిరిశాల కృష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థిని ఛైర్మన్ యుకె.విశ్వనాథరాజు, సెక్రటరీ సామంతపూడి శ్రీరామరాజు, జిల్లా సెక్రటరీ కొత్త శ్రీమన్నారాయణ తదితరులు అభినందించారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలపై

సమరశీల పోరాటాలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు - ఉత్సాహపూరిత వాతావరణంలో సిఐటియు జిల్లా మహాసభ ప్రారంభం

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - పెనుగొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో అన్ని తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు, కార్మికుల్లో కదలిక పెరిగిందని అన్నారు. కార్మిక, ఉద్యోగ, ప్రజల సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి కళ్యాణ మండపంలో సిఐటియు జిల్లా 13వ మహాసభ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. మహాసభకు అధ్యక్ష వర్గంగా బి.వాసుదేవరావు, అజయకుమారి, సిహెచ్.లక్ష్మి, ఎం.సూరిబాబు, జవ్వాది శ్రీనివాస్ వ్యవహరించారు. మహాసభ ప్రారంభోత్సవ సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగోలుగా లేబర్ కోడ్‌లు, ప్రయివేటీకరణ విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. ఫలితంగా రానున్న రోజుల్లో కార్మికులు, రైతులు కట్టుబానిసలుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం రైతుల చేతుల్లోంచి కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపాధి రోజురోజుకీ కుదించబడుతుందని, కార్పొరేట్ సంస్థలు పేక మేడల్లా కూలిపోవడం వల్ల లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల పేరుతో వందల ఎకరాలను చేతుల్లోంచి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ జిల్లాలో పేదల ఇళ్లను తొలగిస్తున్నారని విమర్శించారు. రైస్‌మిల్లులు, ఆక్వారంగం దెబ్బతిని కార్మికులు, రైతులు రోడ్డున పడిన పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. రానున్న కాలంలో కార్మిక, కర్షక ఐక్యత ద్వారా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వం నుంచి నేటి వరకు స్కీమ్ వర్కర్లయిన మహిళలకు ఒక్క రూపాయి వేతనం పెంచలేదని, ఇది అత్యంత దారుణమని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తామని చెబుతున్న పాలకుల మాటలు ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య సదుపాయాలు లేవని, పాఠశాలల్లో అనేక మార్పులు తీసుకొచ్చి విద్యారంగాన్ని ప్రయివేటీకరించే ప్రయత్నాలు సాగుతున్నాయని అన్నారు. వీటన్నింటిని ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మూడు సంవత్సరాల కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు. ఆక్వా, రైస్‌మిల్లు కార్మికులు, స్కీమ్ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు ఇటీవల కాలంలో పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి మాట్లాడుతూ చట్టసభలో ఉద్యోగులు, కార్మికుల తరపున ఆయా సమస్యలపై తన గొంతు విన్పిస్తున్నానన్నారు. ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో అవసరమైతే ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటానని చెప్పారు. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు పతాకాన్ని జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి, ఆర్ఎస్, అల్లూరు సత్యనారాయణ, షేక్ సాల్టీ, చింతకాయల బాబూరావు, పొన్నాడ రాము తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు కూడా సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి, ఎమ్‌డి.హుసేనా, సూర్యిడి వెంకటేశ్వరరావు, డి.జ్యోతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలు ప్రజలకు మరింత చేరువ కావాలి

ప్రముఖ వైద్యులు, విద్యావేత్త కలిదిండి రామచంద్రరాజు

ప్రజా సమస్యలపై చేపడుతున్న ఉద్యమాలు ప్రజలకు మరింత చేరువకావాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ప్రముఖ వైద్యులు, విద్యావేత్త కలిదిండి రామచంద్రరాజు అన్నారు. ఆయన మహాసభ ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రస్తుత పరిస్థితిలో ప్రజాఉద్యమాల ఆవశ్యకత చాలా ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యం పెంచేలా ఉద్యమాలు సాగించాలని ఆకాంక్షించారు. పెనుగొండ గ్రామ సర్పంచి సోనీ మాట్లాడుతూ అభివృద్ధికి దోహదపడేవే ప్రజా ఉద్యమాలు అని అన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

ఏప్రిల్ 15 నాటికి సాగు పూర్తిచేసేలా ప్రణాళిక రూపకల్పన

నీటిపారుదల సలహా మండలి సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా రబీ సాగుకు ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నాటికి దాళ్వా సాగు పూర్తయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం నీటిపారుదల సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రబీ సాగుకు రైతులకు ఎటువంటి నీటి కొరతా లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుండి దాళ్వా సాగుకు నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ మాసూళ్లు పూర్తయిన చోట రబీ సాగుకు సంబంధించిన పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 15 నాటికి రబీ పంట పూర్తిస్థాయిలో రైతుల చేతికొచ్చేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏప్రిల్, మే నెలల్లో పంట కాలువలు, డ్రెయిన్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ రబీ సాగులో రైతులకు ఎటువంటి నీటిఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కె.మురళీకృష్ణరాజు, వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని సూచించారు. డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఇఇ యు.రమేష్, ఎఇ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

సమిత్వ సర్వే వేగవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సమిత్వ సర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన డిపిఒ, సర్వే శాఖ ఎడి, మండల సర్వేయర్లు, డిప్యూటీ ఎంపిడిఒలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్వేయర్లతో సమిత్వ సర్వే పురోగతిపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో రెండో విడత 197 గ్రామాల్లో జరుగుతున్న సమిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి తప్పుల్లేకుండా కచ్చితమైన కొలతలు తీసుకోవాలన్నారు. వారి నుండి దస్తావేజులకు సంబంధించిన వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రస్తుతం అగ్రికల్చర్ రీసర్వే పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయిన వెంటనే జిల్లాలో సర్వే నిర్వహిస్తున్న 33 టీములు కాకుండా మరికొన్ని టీములు సమిత్వ సర్వేకు ఏర్పాటు చేస్తామన్నారు. డిపిఒ ఎం.రామ్‌నాథ్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా మాట్లాడారు.

సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా మారంపల్లి

డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ ప్రసంగి రాజు

ఎల్‌టిసి సెంటర్‌ను పరిశీలిస్తున్న ప్రసంగి రాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లాలో సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా మారంపల్లి ఎల్‌టిసి సెంటర్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ ఎంపిక చేశారని జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ (డిపిఆర్‌సి) జిల్లా కోఆర్డినేటర్ ప్రసంగి రాజు అన్నారు. శనివారం మారంపల్లిలో ఎల్‌టిసి సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త సేకరణపై ప్రజలకు ఏ మేరకు అవగాహన ఉందో ఇంటింటికి వెళ్లి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, సర్పంచి సరిపల్లె పద్మ చిట్టిబాబు, వార్డు సభ్యులు, కార్యదర్శి సరస్వతి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలన విధ్వంసం : మంత్రి నిమ్మల

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ పాలనలో విధ్వంసం తప్ప అర్ధ రూపాయి అభివృద్ధికి నోచుకోలేదని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన కూటమి నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. స్థానిక ఎఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో రూ.34 లక్షలతో నిర్మించనున్న బాలికల హాలు, టాయిలెట్స్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.కోటీ యాభై లక్షలతో నిర్మిస్తున్న వేణుమాధవ్ సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. డంపింగ్ యార్డు స్థలాల్లో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలన చెత్తగా సాగిందని, పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్ను, కులాయి పన్నులతో పాటు చెత్త మీద కూడా పన్ను వేసి ప్రజలపై భారం మోపిందన్నారు. పాలకొల్లు పట్టణంలో దీర్ఘకాలిక డంపింగ్ యార్డ్ సమస్య శాశ్వతంగా తీర్చేలా ప్రత్యేక దృష్టి సాధించానని తెలిపారు. కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, దనాని సూర్యప్రకాష్, గాది చిన్న వెంకన్న, మల్లంపల్లి పకీర్‌బాబు, ముప్పిరి సత్యనారాయణ, బోనం నరసయ్య, ఉన్నమట్ల కపర్ది పాల్గొన్నారు.

40 రోజుల్లో రోడ్ల పనులను పూర్తి చేయాలి

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో పెండింగులో ఉన్న రోడ్ల అభివృద్ధి పనులను 40 రోజుల్లోగా పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో శనివారం ఆర్‌అండ్‌బి అధికారులతో ఆయన సమీక్షించారు. సంక్రాంతికి భీమవరం వైపు ప్రజల తాకిడి పెరుగుతుందన్నారు సంక్రాంతి నాటికి ఇబ్బందులు లేకుండా రోడ్లన్నీ అభివృద్ధి చేసేలా ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని సూచించారు.

వికలాంగురాలి పట్ల ఇఒ దురుసు వైఖరి!

శక్తి యాప్‌లో ఫిర్యాదుతో వెలుగులోకి

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఫిర్యాదు అందినట్లు వన్‌టౌన్ సిఐ ధ్రువీకరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పంచారామ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలో దర్శనం సమయంలో వికలాంగురాలి పట్ల ఇఒ దురుసుగా వ్యవహరించారంటూ ఫిర్యాదు నమోదైంది. దీంతో ఆ ఇఒ వైఖరిపై సర్వత్రా విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించి బాధితురాలు ఎం.ఎం.లక్ష్మికుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 17న కార్తీక సోమవారం క్యూలైన్‌లో పట్టణానికి చెందిన వికలాంగ మహిళ అందరితో కలిసి చేతుల ఆధారంగా నడుచుకుంటూ క్యూలైన్‌లో అంతరాలయ దర్శనానికి వెళ్లారు. అదే సమయంలో అక్కడున్న ఆలయ ఇఒ రామకృష్ణరాజు తనను భుజంపై చేయి వేసి పక్కకు లాగేశారని, ఆపై 'నీకు కూడా ఇప్పుడే దర్శనం కావాలా' అంటూ చులకనగా మాట్లాడారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. నలుగురిలో భుజంపై చేయి వేసి లాగేయడమే కాకుండా కించపరుస్తూ మాట్లాడడంతో తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అత్యంత అవమానకర రీతిలో తాను బయటకు వచ్చేశానని, మహిళ, ఆపై వికలాంగురాలనే విచక్షణ, మానవత్వం ఇఒలో కన్పించలేదని ఆమె వాపోయారు. ఆపై శక్తి యాప్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కూ ఫిర్యాదు చేశానని చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఇటు పోలీసు, అటు దేవాదాయ శాఖాధికారులు తెలిపారన్నారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా సంబంధిత ఆలయ ఇఒపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ప్రతి ఆలయంలో వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం అటువంటివేమీ ఏర్పాటు చేయరని, అడిగినా పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమేశ్వర స్వామి ఆలయ ఇఒ రామకృష్ణరాజుపై ఏదైనా ఫిర్యాదొచ్చిందా అని వన్‌టౌన్ సిఐ నాగరాజును వివరణ కోరగా శక్తి యాప్‌లో ఫిర్యాదు వచ్చిందని ధ్రువీకరించారు.

తుపాన్ హెచ్చరికలతో రైతులు ఉరుకులు పరుగులు

ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు

రెండు జిల్లాల్లో 4.25 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఇప్పటి వరకూ 1.75 లక్షల ఎకరాల్లో కోతలు పూర్తి

2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

టార్పలిన్లు అందజేతలో తాత్సారం

'దిత్వా' దిగులు..!

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. దిత్వా తుపాన్ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. తుపాను ఈ నెల 30న తమిళనాడు, దక్షిణ కోస్తా తీరానికి చేరే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ మాసూళ్లు త్వరగా పూర్తి చేసేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏలూరు జిల్లాలో 2.07 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటికి 95 వేల ఎకరాల్లో వరికోతలు పూర్తవ్వగా లక్షా 45 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోలు పూర్తయ్యింది. దాదాపు ఇంకా లక్షకుపైగా ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉంది. అధికారుల అంచనా ప్రకారం దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, పంట కళ్లాల్లోనే ఉంది. పశ్చిమలో 2.19 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇప్పటి వరకూ 75 వేల ఎకరాల్లో రైతులు వరికోతలు పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం లక్షా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. రెండు జిల్లాల్లోనూ 2.50 లక్షల ఎకరాల్లో కోతలు కోయకుండా, కళ్లాల్లో ధాన్యం రూపంలో ఉంది. దాదాపు తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర నష్టాలను చవిచూసే పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.35 వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. మొంథా తుపాన్ ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. సంపత్ స్వర్ణ రకం ఎకరాకు 35 బస్తాల్లోపే దిగుబడి వస్తోంది. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తుపాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే రైతులకు దిక్కుతోచని పరిస్థితి రానుంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయి. ధాన్యం సొమ్ము సైతం 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో జమవుతుంది. మరో వారం, పది రోజులు ఆగితే ఖరీఫ్ మాసూళ్లు దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో తుపాన్ హెచ్చరికలు అన్నదాతను బెంబేలెత్తిస్తున్నాయి.

కౌలురైతుల పరిస్థితి అత్యంత ఘోరం

రెండు జిల్లాల్లో 80 శాతం సాగు కౌలురైతులే చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 15 నుంచి 17 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంది. అక్టోబర్ చివరి వారంలో విరుచుకుపడిన మొంథా తుపానుతో రెండు జిల్లాల్లో 33 వేల ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయినట్లు అధికారులు లెక్కలుగట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాలు ఉండగా, ఏలూరు జిల్లాలో 12,560 ఎకరాల వరకు పంటనష్టం వాటిల్లింది. 33 శాతానికిపైగా పంట దెబ్బతిన్న పొలాలనే అధికారులు లెక్కల్లోకి తీసుకున్నారు. 30 శాతం వరకూ దెబ్బతిన్న పొలాలు సైతం పెద్దఎత్తున ఉన్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు నివేదించిన జాబితాలో సాగు చేసిన కౌలురైతుల పేర్లు లేవు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూయజమానుల పేర్లను నమోదు చేశారు. పెట్టుబడి పెట్టిన కౌలురైతుకు నష్టపరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. పొట్ట, ఈనిక దశలో మొంథా తుపాను రావడంతో గింజలు పాలుపోసుకుని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాల్లో ఎకరాకు 20 బస్తాల దిగుబడి కూడా రాని పరిస్థితి ఉంది. కౌలుపోను ఎకరాకు ఐదు బస్తాలు కూడా కౌలురైతులకు మిగలని దుస్థితి. ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన కౌలురైతులకు దిత్వా తుపాన్ హెచ్చరికలతో గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సాగు చేస్తున్న కౌలురైతులను ప్రభుత్వం ఆదుకోకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. దిత్వా తుపాను జిల్లాపై ప్రభావం చూపితే కౌలురైతులు పూర్తిగా రోడ్డున పడనున్నారు.

టార్పలిన్ల అందజేతపై తాత్సారం

వర్షాలు కురిస్తే ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు టార్పలిన్లు ఉచితంగా అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతున్నారు. ప్రతి రైతుసేవా కేంద్రంలో 25 వరకూ టార్పలిన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌలురైతులకు మొదటి ప్రాధాన్యత అని సైతం చెప్పారు. ఇప్పటి వరకూ టార్పలిన్లు అందించలేదని రైతులు చెబుతున్న పరిస్థితి ఉంది. టార్పలిన్లు త్వరితగతిన అందించాలని రైతులు కోరుతున్నారు. వర్షం కురిస్తే ధాన్యం కాపాడుకునేందుకు రైతులు ముందుగానే సిద్ధంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

హామీలు సరే.. కార్యాచరణేదీ..!

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం రెండు జిల్లాల్లో అధ్వానంగా తయారైన రోడ్ల పరిస్థితిపై మరోసారి చర్చకు వేదికలయ్యాయి. ఇక ధాన్యం రైతుల పరిస్థితి ఏంటనేది పౌర సరఫరాల శాఖా మంత్రి క్షేత్రస్థాయి పర్యటనలో బట్టబయలైంది. జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది.

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలం రాజవరం వద్ద ఆ పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తమ రోడ్ల సమస్య పరిష్కరించాలంటూ రోడ్డెక్కడం గమనార్హం. తొలుత పోలీసులు వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేసినా వారేమాత్రం తగ్గకుండా తమ సమస్య చెప్పుకుని తీరుతామని భీష్మించడంతో పవన్ తన పర్యటన ముగించుకుని వెళ్తూ వారి సమస్యపై వినతిపత్రం అందుకుని త్వరలోనే రోడ్ల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక జిల్లా పరిషత్ సమావేశంలోనూ రోడ్ల సమస్యపై అధికార పార్టీ ఎంఎల్‌ఎలే గళమెత్తారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కూటమి అధికారంలోకి రాగానే సంక్రాంతి లోపు గోతులు పూడ్చి, ఆపై పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామని ప్రకటించింది. ఆ సంక్రాంతి వెళ్లి మరో సంక్రాంతి వస్తుందిగాని రెండు జిల్లాల్లో రోడ్ల పరిస్థితి బాగుపడలేదు. దీనికి నిదర్శనం ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలే నిదర్శనం. అటు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఇటు జెడ్‌పిలో చర్చ నేపథ్యంలో రోడ్ల పనులు ఇప్పటికైనా చేపడతారా అని రెండు జిల్లాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇటీవల ఉంగుటూరు నియోజకవర్గంలో రెండుసార్లు పర్యటించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ మార్గమధ్యంలో రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులను పలుకరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. ఈ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ప్రభుత్వం, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేసినా అవేమీ అమలు కాకపోవడం మంత్రినే విస్మయానికి గురి చేసింది. తమ ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో కూడా రైతులకు తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదని మంత్రి పర్యటనలో వెల్లడైంది. ధాన్యం మిల్లుకు తోలిన 24 గంటల్లో సొమ్ము జమ చేస్తున్నామంటున్న ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆ ప్రక్రియకు ముందు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

ఇక కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రధానంగా పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా అందులో పోలవరం నియోజకవర్గంగాని, కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలోని ఐదు మండలాలుగాని లేకుండానే నోటిఫికేషన్ విడుదల చేయడం చర్చనీయాంశమైంది. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కావాలంటే రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల్లోని గిరిజన మండలాలతో గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దీనిపై ఎన్నికలకు ముందు చంద్రబాబు సైతం హామీ ఇచ్చారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో ఏలూరు జిల్లాలోని ఐదు గిరిజన మండలాలను విస్మరించడం ఈ పరిధిలోని నిర్వాసితులకు తీవ్ర నిరాశ కల్గించింది. ఎందుకంటే ఇదే మండలాల్లో రంపచోడవరం నియోజకవర్గంలోని నిర్వాసితులకూ పునరావాసం కల్పిస్తున్నారు. వారు తమ సమస్యల పరిష్కారం కోసం ఏలూరు వెళ్లాల్సి రావడం అంటే కష్టసాధ్యమే. మొత్తంగా నిర్వాసితులంతా ఒకే జిల్లా పరిధిలోకి వస్తే ప్రాధాన్యత క్రమంలో వారి సమస్యలను పరిష్కరించడానికి అధికారులకూ అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలని ఏలూరు జిల్లాలోని ఐదు ఏజెన్సీ మండలాల ప్రజలు కోరుతున్నారు. ఇక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలోనూ, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలోనూ కలపాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. అయితే ఆ ప్రస్తావనేమీ ఈ నోటిఫికేషన్‌లో లేదు. మొత్తంగా హామీలివ్వడం తప్ప కార్యాచరణలో చర్యలు ఉండటం లేదని జనం పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు హామీల అమలు దిశగా అడుగులు వేయాలని జనం కోరుతున్నారు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

రైతులు ఎరువులు, పురుగు మందులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మరలారని ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో సూచించారు. శనివారం వెంకట్రామన్నగూడెం గ్రామంలో తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్‌తో కలిసి రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ వ్యవసాయానికి సాంకేతికత జోడిస్తూ పెట్టుబడి తగ్గించుకుంటూ రైతులు లాభాలు పొందాలని సూచించారు. ప్రతి రైతూ ఏపి ఎఐఎంఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని వ్యవసాయ, అనుబంధ రంగాల సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. వాతావరణాలు తుపాన్ హెచ్చరికల గురించి రైతులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆధ్వర్య పద్ధతి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఎ.డివ్యాసాగర్, ఏవోపీఏ ఆర్.బాలగంగాధర్, ఎహెచ్ఎ ఆదిలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడాలి : ఎంఎల్‌సి గోపిమూర్తి

గణపవరం: విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపిమూర్తి అన్నారు. శుక్రవారం రాత్రి పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ ఎన్నిక సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సభకు బి.రమేష్ అధ్యక్షత వహించారు. సభలో గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనులు నిలుపాలన్నారు. వారిని విద్యా బోధన వరకే పరిమితం చేసే మందిరిని తెలిపారు. సభలో కార్యదర్శి జెడి భగవాన్ ప్రసాద్ ప్రవేశపెట్టిన నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం నూతన కౌన్సిల్ అధ్యక్షులుగా శర్మ, ప్రధాన కార్యదర్శిగా మద్దాల వెంకటేశ్వరరావు, మరో ఏడుగురిని నూతన కౌన్సిల్ ఎన్నుకొంది. జిల్లా మహాసభకు ఏడుగురు ప్రతినిధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, ఎస్.రత్నంరాజు శివప్రసాద్, మాజీ ఎంఇఒ రామరాజు, సీనియర్ నాయకులు, అంజనేయులు పాల్గొన్నారు.

వృద్ధుల అనర్థాలపై అవగాహనుండాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి – తణుకు

వృద్ధాల వల్ల కలిగే అనర్ధాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. రోటరీ క్లబ్, విశ్వ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ తణుకు పేరుతో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. వ్యర్థాల నిర్మూలనకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషితో పాటు ప్రజల సహకారం కూడా ముఖ్యమని అన్నారు. స్వచ్ఛ తణుకు నెరవేరే క్రమంలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మనవ మనుగడకు అతి ప్రధానమైన నేల, నీరు, గాలి కలుషితం బారిన పడడం ద్వారా భవిష్యత్తు మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంట కాలువలు సైతం కలుష్యం బారిన పడుతుండడంతో రైతులు నుంచి ఆందోళన వ్యక్తమవుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛతణుకున్ని కాపాడుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, విశ్వ ఫౌండేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

వీరవాసరం: ఈ నెల 30న వీరవాసరంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వీరవాసరం కాపునాడు అధ్యక్షుడు గుండా రామకృష్ణ శనివారం తెలిపారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్, కాపు క్లబ్, వీరవాసరం కాపునాడు ఆధ్వర్యంలో భీమవరం వినాయక హాస్పటల్ వారిచే ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్, లాప్రోస్కోపిక్ వైద్యం, గర్భిణులకు, యూరాలజీ, కిడ్నీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ, ఫిజియో థెరపీ వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు, సివిల్‌ఎక్స్ గణపతి రాజుసురేంద్ర, జెఎన్. దివ్యతేజ స్వరూప్, ఎం.లక్ష్మీచందన, పిడిఎం.స్వరూప్, జి.ఫణీంద్రనాథ్, సురేంద్రవర్మ పాల్గొంటారని తెలిపారు.

ఉపకారాగారాన్ని సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి – భీమవరం టౌన్

మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హసీన ప్రత్యేక ఉపకారాగారాన్ని సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ముద్దాయిలకు జైలులో అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గదిని పరిశీలించి భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో జైలు సహాయ కేంద్రం ఉచిత న్యాయవాది పి.అంబేద్కర్, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటరావు, పారా లీగల్ వాలంటీర్ ఎస్.సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం సబ్ జైలును శనివారం నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి తనిఖీ చేశారు. జైల్లో ముద్దాయిలను కేసు వివరాలు, ఆరోగ్య పరిస్థితి, ఆహారం తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు. జైలు ముద్దాయిల పరివర్తనతో బయటికి వెళ్లాలన్నారు. ఆర్థిక స్థోమత లేనివారు అప్పీల్ చేసుకొనేందుకు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టోర్ రూమ్, వంటశాలను పరిశీలించారు. ఉప కారాగార పర్యవేక్షణాధికారి బి.అప్పారావు, జైల్ సిబ్బంది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నరసింహారాజు పాల్గొన్నారు.

తణుకు: ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే వారికి మండల న్యాయసేవ కమిటీ తణుకు వారి ద్వారా ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పివిఎన్.రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక తణుకు సబ్‌జైలును సందర్శించి ముద్దాయిలను అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి రంజిత్‌కుమార్ మాట్లాడారు. జైలు క్లినిక్ న్యాయవాది డి.కృష్ణకుమారి, పారాలీగల్ వాలంటీర్ ఎం.శ్రీదేవి, న్యాయవాది వి.ఆదినారాయణ, జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ఉద్యోగాలకు ఎంపికైన స్నేహసుధ, నిధి

తాడేపల్లిగూడెం: 2025–26 విద్యా సంవత్సరానికి గాను స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు శనివారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ తెలిపారు. ప్రముఖ కంపెనీ ఎసిఎంఇజి ఆర్‌ఎడిఆర్ ఇద్దరు విద్యార్థులు సిహెచ్‌ఎస్‌.స్నేహ సుధ (బిబిఎ), కె.నిధి (బిబిఎ) వార్షిక వేతనం రూ.8.5 లక్షలతో ఉద్యోగాలు పొందారన్నారు. ఐకమయం కూడా అనేక కంపెనీల్లో ప్లేస్‌మెంట్ ఉన్నాయని ఇది శుభారంభం అని ఆనందం వ్యక్తం చేశారు. ఆదిత్య అంటేనే ఉద్యోగాలు అని మరోసారి రుజువైందని, ఇది మా ప్రణాళిక వల్లే సాధ్యమని డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ నల్లమిల్లి సుగుణరెడ్డి విద్యార్థినులను అభినందించారు.

చెరువు చుట్టూ నిర్మించిన ప్రహరీ ప్రారంభం

ఉండి: దాతల సహకారంతో సుమారు రూ.15 లక్షలతో తాగునీటి చెరువు చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కనే తాగునీటి చెరువు ఉండటంతో విద్యార్థుల భద్రత దృష్ట్యా చెరువు చుట్టూ విహన్ కాఫీ పొడి కంపెనీ కామేపల్లి సత్యనారాయణ సహకారంతో గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు ప్రహరీ గోడ నిర్మించారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం వింజమూరి అక్బర్ ఫ్రెఢరిక్ పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఉంగరాల నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

కొనసాగిన మెడికల్ క్యాంపు

పాలకొల్లు: పాలకొల్లు అడ్డేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ఆడవిపాలెంలో స్పెషల్ క్యాంపులో భాగంగా మూడో రోజు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామీణ సమస్యలపై డోర్ టు డోర్ సర్వే, ఓపెన్ యూరినేషన్ అండ్ డెఫికేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వాలంటీర్లు తాగునీరు, డ్రైనేజీ సమస్యలను గుర్తించారు. మధ్యాహ్నం ఆడవిపాలెంలో ఎఎన్ఎం సరళ, వారి సిబ్బంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో హెల్త్‌కేర్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆడవిపాలెం టిడిపి గ్రామ అధ్యక్షులు చెరుకూరి ఆంజనేయులు, బొలిశెట్టి రాంబాబు, టిడిపి నాయకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి ఇటుకలు అందజేత

పాలకొల్లు: పాలకొల్లు యడ్ల గణేష్‌రావు సేవ ఫౌండేషన్ ద్వారా పెయింటర్ అసోసియేషన్ వారి కళ్యాణ మండపం నిర్మాణం నిమిత్తం 3000 ఇటుకలు యడ్ల తాతాజీ అందజేశారు. సుమారు లక్ష రూపాయలు ఇక్కడ ఖర్చు లేకుండా కళ్యాణ మండపం దొరకని పరిస్థితుల నేపథ్యంలో పని చేసుకుంటే గ్రామ ప్రజలకు అతి తక్కువ ధరకు పెళ్లిళ్లు చేసుకోవడానికి ఇబ్బంది లేకుండా వీలు కలుగుతుంది. ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టిన పెయింటర్ అసోసియేషన్ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి ప్రధాన ద్వారా ఇటుకలు బహూకరించారు. పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షులు నీలం రవికుమార్, గౌరవాధ్యక్షులు కోరుకొండ సుబ్బారావు, కార్యదర్శి అధికారి పవన్‌కుమార్, కోశాధికారి బొప్పె దుర్గాప్రసాద్ షణ్ముఖరావు అగ్రజైజింగ్ సెక్రెటరీ చలపతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి యువత కృషి చేయాలి : జెసి

మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి – భీమవరం టౌన్

విద్యార్థులు యువత నిరంతరం స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడం నూతన అంశాన్ని కనుగొనడం వంటివి చేస్తే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్కూల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి పి.లోక్మాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ చదువుతోపాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగం సంపాదించాలని, దీన్ని ప్రతి యువకుడూ గమనించాలని చెప్పారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో పాల్గొన్న యువకులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిస్ట్రిక్ట్ అధికారి పి.లోకమాన్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతోపాటు వారికి శిక్షణ కూడా అందించేందుకు నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణరాజు, ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ కెఆర్.సత్యనారాయణ, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ దిలీప్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఆరెంజ్ మెన్స్ వేర్ ప్రారంభం ఆనందదాయకం

ప్రజాశక్తి – భీమవరం టౌన్

నాణ్యమైన వస్త్రాలు అందించాలనే ఉద్దేశంతో భీమవరంలో వస్త్ర దుకాణాన్ని ప్రారంభించుకోవడం ఆనందదాయకమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఆరెంజ్ మెన్స్ వేర్‌ను శనివారం ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. విద్య, వైద్య, వాణిజ్య వ్యాపార రంగంలో భీమవరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణానికి ఎన్నో రకాల సంస్థలు ముందుకొస్తున్నాయన్నారు. ప్రజలకు నాణ్యమైన మన్నికైన వస్త్రాలను అందించాలన్నారు. స్టోర్ హెడ్ సాగర్ కుమార్, బాల నాయుడు, జగదీష్ నాయుడు మాట్లాడుతూ అన్ని రకాల మెన్స్ వేర్ ఐటమ్స్ అందుబాటులో లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముచ్చకర్ల శివ, లంకి చిన్ని పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి – ఉండి

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించొచ్చని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం చెరుకువాడలో పర్యటించిన రఘురామ కృష్ణ రాజుకు సీసీ కెమెరాలు నిమిత్తం 75 వేల రూపాయల చెక్కును టిడిపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత వ్యసనాలకు లోనై సులభ మార్గంలో డబ్బులు పొందేందుకు దొంగతనాలకు అలవాటు పడ్డారని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన ముదునూరి కృష్ణంరాజు, చెన్నంశెట్టి ప్రసాద్, నల్లూరి వెంకటేశ్వరరావు, మంతెన చంటి రాజును అభినందించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, చెరుకువాడ గ్రామ అధ్యక్షులు ఉంగరాల నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇర్రింకి బుజ్జి, ఆకివీడు సిఐ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

సంసిద్ధ్‌లో సైన్స్‌ఫేర్

ప్రజాశక్తి – నరసాపురం

విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలిస్తున్న వైనం

విద్యార్థుల సృజనాత్మకతకు, శాస్త్రీయ దృక్పథానికి వేదిక సంసిద్ధ్ స్కూల్ అని డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) అన్నారు. శనివారం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో సంసిద్ధ్ స్కూల్ ఆధ్వర్యంలో ఛైర్మన్ వాస శ్రీనివాస్ అకాడమిక్ ఎక్స్పో, సైన్స్ ఫెయిర్ విద్యార్థులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఛైర్మన్ మురళీకష్ణ (చిన్నా) హాజరై ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు పరిశోధనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతకు, శాస్త్రీయ దృక్పథంతో భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని కోరారు. చదువుతోపాటు విద్యార్థులు పరిశోధనా రంగం వైపు దృష్టి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంసిద్ధ్ స్కూల్ క్లస్టర్ మేనేజర్ మెట్ల సురేష్, ప్రిన్సిపల్ లావణ్య, అడ్మిన్ మేనేజర్ నారాయణబాబు పాల్గొన్నారు.

యర్రంశెట్టివారిపాలెంలో..

యర్రంశెట్టి వారి పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు వ్యవసాయం సోలార్, ఇల్లు నమూనా నిర్మాణం వంటి వివిధ రకాల వైజ్ఞానిక పరికరాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబ, మాజీ ఎఎంసి ఛైర్మన్ యర్రంశెట్టి బాబు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు సర్పంచి నాగ ముత్యమాంబ బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టారు కులపతి శ్రీనివాసరావు సుబ్బారావు పాల్గొన్నారు.

పంచాయతీలకు చెత్త సేకరణ ట్రాక్టర్లు

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని పంచాయతీలకు ప్రభుత్వం చెత్త సేకరణ ట్రాక్టర్లను పంపిణీ చేసింది. పేరుపాలెం నార్త్, కెపి.పాలెం సౌత్, కెపి పాలెంనార్త్, ముత్యాలపల్లి, కొత్తోట, కాళీపట్నం పడమర గ్రామాలకు గతంలో ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వాటి వినియోగించేందుకు వీలుగా చెత్త సేకరణకు ట్రక్కులను మండల కేంద్రం మొగల్తూరు నుండి ఆయా పంచాయతీ కార్యదర్శులు శనివారం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది, ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో ఐక్యత

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి – నరసాపురం

మండలంలోని సీతారామపురం జెబీరా హైస్కూల్ మైదానంలో శనివారం మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషను రాజు, ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, మాజీ ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్, మాజీ ఎంపీ హర్షకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నియోజకవర్గ స్థాయిలో మాలల అత్మీయ సమ్మేళనం నిర్వహించడం వల్ల మనలో ఐక్యత మరింత పెరుగుతుందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితులు సమాజంలో ముందుకు సాగాలన్నారు. విద్య, రాజకీయ, వ్యాపారపరంగా ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఎస్‌సి వర్గీకరణపై ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఈ సమారాధనకు పటణ మండల, మొగల్తూరు మండలాల నుంచి కుటుంబ సమేతంగా విచ్చేశారు. సోడదాసి శ్రీధర్, దొండపాణి స్వామి, డి.వెంకట్, జాన్ కెనడీ, ఎం.సోని, బి.రవీంద్ర, కె.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన పది టెస్ట్ పేపర్ల పంపిణీ

యలమంచిలి: యుటిఎఫ్ మండల శాఖ 15 సంవత్సరాలుగా నిర్విరామంగా ఉచితంగా అందిస్తున్న పదో తరగతి టెస్ట్ పేపర్ల పంపిణీ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. మండలంలోని 11 హై స్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన టెస్ట్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. శ్రీ పింగళి వెంకయ్య జిల్లా ప్రజా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల కాజలో జరిగిన కార్యక్రమంలో కొప్పినీడి సర్వేరరావు, గోటేటి రామలింగేశ్వరరావు ఆర్థిక సాయంతో విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం మహ్మద్ లియాఖత్ ఆలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ యుటిఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు. డ్యూటీ ఆఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడారు. గుత్తిం దీవి శ్రీనివాస్, పంతం రామూర్తి నాయుడు, బాపిరాజు పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య మనస్పర్థలు

ఒకరు హత్య

తణుకు: ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒకరు హత్యకు గురైన సంఘటన తణుకులో చోటుచేసుకుంది. తణుకు రూరల్ పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. గౌతమి స్వాలెంట్ ఫ్యాక్టరీ వెనుక, పైడిపర్రు గ్రామానికి చెందిన కందుల శ్రీను, శిరాళం ప్రభాకర్ (28) ఇరువురు స్నేహితులు. ఇద్దరి ఇళ్లు ఎదురెదురుగా ఉన్నాయి. కందుల శ్రీను బంధువును ప్రభాకర్ వేధిస్తున్నాడనే అనుమానంతో ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని ప్రభాకర్‌ని చంపుతానని బెదిరిస్తూ ఉండేవాడని తెలిపారు. కొన్ని రోజుల క్రితం ప్రభాకర్, కందుల శ్రీనును గాయపరిచాడు. దీన్ని అవమానంగా భావించిన శ్రీను తన స్నేహితుడు కపకాయల గణేష్‌తో కలిసి ప్రభాకర్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక చేశాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ప్రభాకర్ ఇంటికొచ్చిన శ్రీను, గణేష్ కలిసి అతనిపై కత్తితో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన ప్రభాకర్‌ను చికిత్స నిమిత్తం తణుకులోని ఆపిల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఇప్పటికే ఒబ్బిడి అయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. మరో నాలుగు రోజుల వరకూ వరి కోతలు చేయొద్దని తెలిపారు.

ఉండి : ఉండి మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ పెదపుల్లేరు, చిన్నపుల్లేరు, వాంద్రం, ఉండి తదితర గ్రామాల్లో పర్యటించి ద్విత్వా సైక్లోన్ నిమిత్తం రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వర్షాలు తగ్గే వరకూ కోతలను వాయిదా వేసుకోవాల్సిందిగా కోరారు. రాశుల మీద ఉన్న ధాన్యాన్ని వెంటనే రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించే ఏర్పాట్లు రైతులు చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్నటువంటి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని తెలియజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

డిఐఇఒ ప్రభాకర్ రావు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శనివారం సాయంత్రం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, అధ్యాపకులను పాఠ్యాంశాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంకల్పం పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత అధ్యాపకులదే అన్నారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి వారిని చదివించి రాయించాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగవేణి, అధ్యాపకులు వాయునందనరావు, జయరాం పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాల మెరుగుకు ప్రణాళికలు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి – పాలకోడేరు

ప్రభుత్వ పాఠశాలలను దాతల సహకారంతో మరింత అభివృద్ధి పర్చడంతోపాటు ఆ పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 27వ తేదీ నుంచి జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్–14 నెట్ బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే విధంగా ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఉండి నియోజకవర్గాన్ని దాతలు, పూర్వవిద్యార్థుల సహకారంతో పాఠశాలలను, క్రీడా మైదానాలను అభివృద్ధి చేసి మంచి క్రీడాకారులు తయారయ్యే విధంగా ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విశాఖపట్నం, రెండో స్థానంలో నిలిచిన పశ్చిమగోదావరి, మూడో స్థానంలో నిలిచిన కృష్ణా జట్లకు బహుమతులు అందించారు. బాలుర విభాగంలో గెలుపొందిన విశాఖపట్నం, రెండో స్థానంలో నిలిచిన తూర్పుగోదావరి, మూడో స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి బాలుర జట్లకు రఘురామకృష్ణరాజు బహుమతులు అందించారు. హెచ్ఎం జగన్నాథరావు, ఎంఇఒలు నాగరాజు, హరి అనంద ప్రసాద్, జాన్సన్, కలిదిండి కృష్ణంరాజు, సర్పంచి జంగం సూరిబాబు, జనసేన నాయకుడు జుత్తిగ నాగరాజు, పాలకోడేరు సొసైటీ అధ్యక్షుడు కె.నాగరాజు, చిట్టిబాబు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

కొనసాగిన స్కూల్ బస్సుల తనిఖీ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

బస్సుల ఫిట్నెస్ సరిగ్గా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డిఎస్ నాయక్ హెచ్చరించారు. శనివారం రెండో రోజు బస్సులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 80 బస్సులు పరీక్షించగా వాటిలో 19 బస్సులకు లోపాలున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ బస్సులను వారం రోజుల్లోగా సరిచేసుకోవాలని లేకుంటే వాహనాలు సీజ్ చేయడమే కాకుండా కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న జస్ బీర్ సింగ్ గిల్

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి – కాళ్ల

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు చేపడుతున్నామని మాజీ ఎంపీ, ఎఐసిసి పరిశీలకులు జస్ బీర్ సింగ్ గిల్ అన్నారు. కాళ్లకూరులో కాంగ్రెస్ గత సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి కుమార్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఐసిసి పరిశీలకులు జస్ బీర్ సింగ్‌గిల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో డిసిసి అధ్యక్షుల నియామకాలు చేపట్టేందుకు సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయొచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పర్యటన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కెబిఆర్‌కె.నాయుడు, కాంగ్రెస్ కోఆర్డినేటర్ తాళ్లూరి విజయకుమార్, జంపన సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమునాగ కేశవబాబు, పార్టీ భీమవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి అంకెం సీతారాం, మండల అధ్యక్షులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమార రత్నం సేవలు చిరస్మరణీయం

సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి

యలమంచిలి: సిపిఎం మాజీ ఎంపిటిసిగా పనిచేసిన ఏనుగువానిలంక గ్రామానికి చెందిన పాలపర్తి కుమార రత్నం గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి అన్నారు. ఇటీవల వృద్ధాప్యంతో మతి చెందిన సిపిఎం సానుభూతిపరుడు పాలపర్తి కుమార రత్నం ఇంటి వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జార్జితో పాటు కుమార రత్నం సమకాలీకులైన సిపిఎం సీనియర్ నేత మాసవరపు సుబ్బారావు మాట్లాడుతూ కుమార రత్నం సిపిఎంలో సుమారు పాతిక సంవత్సరాల పాటు కొనసాగడంతో పాటు ఒకసారి పార్టీ తరపున ఎంపిటిసిగా, సుమారు పాతిక సంవత్సరాల పాటు పంచాయతీ వార్డు మెంబర్‌గా పనిచేసి గ్రామంలో కుల మతాలకు అతీతంగా ఎవరికి ఏ సమస్యలు వచ్చినా గ్రామానికి చెందిన మరో సిపిఎం సీనియర్ నేత దేవరపు గణపతితో కలిసి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పట్టుదలతో కృషి చేశారని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల అధికారులతో పోట్లాడి మరిన్ని నిధులు రప్పించి ఎనలేని సేవలు చేసి గ్రామ ప్రజల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు గూడూరి ఆంజనేయులు, కొప్పిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమార రత్నం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

బాల్యవివాహాల రహిత రాష్ట్రంగా మార్చాలి

ప్రజాశక్తి – గణపవరం

బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఐసిడిఎస్ గణపవరం సెక్టార్ సూపర్‌వైజర్ బి.విజయలక్ష్మి అన్నారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి నిధుల మంజూరుకు తీర్మానం

ప్రజాశక్తి – ఆకివీడు

పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాలకవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. 20 వార్డుల్లో అభివృద్ధికి సమానంగా నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఆ విధానంలో ప్రతి వార్డుకూ రూ.3 లక్షల చొప్పున 20 వార్డులకు మొత్తం రూ.60 లక్షల నిధులు మంజూరుకు తీర్మానించారు. నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం శనివారం సాయంకాలం పాలకవర్గ ఛైర్ పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. పట్టణంలో వీధిలైట్లు, స్తంభాలు, పలు షెడ్ల పునర్నిర్మాణానికి ఇతర నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు. పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ అనవసరమైన ఖర్చులు పెరిగిపోతున్నాయని వాటిని తగ్గించాలని సూచించారు. కౌన్సిలర్ నిమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన తాగునీటి గొట్టాల ఏర్పాటు, డ్రెయినేజీ నిర్మాణాలను వెంటనే చేపట్టాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

మొగల్తూరు: మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి జి.శ్రీవేద అరవింద్ శనివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఆమె పరిశీలించారు. కేసుల పరిష్కారంలో వేగవంతం చేయాలని సిబ్బందికి, పెండింగ్ కేసులు క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐలు జి.వాసు, వై.నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని పెన్షనర్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.నర్సిరెడ్డి, పాలా ప్రసాద్ కోరారు. శనివారం మండలంలోని మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జరిగిన మండల పెన్షనర్స్ సమావేశంలో వారు మాట్లాడుతూ పెన్షనర్లకు పిఆర్‌సి, డిఆర్ఎ బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశానికి గౌరవ అధ్యక్షులు టి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు పి.కేశవరెడ్డి, ట్రెజరర్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **GUBBALA DURGA SRINIVAS** (New Name), S/o. Mariyya, Previously Called **GUBBALA SRINIVASA RAO** (Old Name), Resident of D.No.1-87/1, Maremma Gadde Veedhi, Mulaparru Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534123, Andhra Pradesh. I have changed my name from **GUBBALA SRINIVASA RAO** (Old Name) To **GUBBALA DURGA SRINIVAS** (New Name) for all practical purposes.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరి దుర్గ భవాని భర్త సాయిబాబు డోర్ నెంబర్ 10–193 ఎన్ వి చెరువు కవిటం, పోడూరు మండలం పిన్కోడ్ నెంబర్ 534338. పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ప్రజలకు తెలియ జేయడం ఏమనగా నేను విశాఖపట్నం పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి S 7077937 నెంబర్ గల పాస్పోర్ట్ పొందాను. కవిటం మా ఇంటి నుంచి పాలకొల్లు జిరాక్స్ సెంటర్కు నా పాస్పోర్టు ను జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్ పై వెళుతుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైనా దొరికినచో పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్పోర్ట్ అందజేయగలరు.

సెల్ నెంబర్ **9704539061.**

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.49/2024 in O.S.No.299/2025

Between:
మాఘం శ్రీనివాసరావు ...డిక్రీ హోల్డర్
And
బంగారు శ్రీనివాసుబాబు ...జడ్జిమెంట్ డెబ్టర్
To.
బంగారు శ్రీనివాసుబాబు, తండ్రి మాధవ మాణిక్యాలరావు, డోరునెం. 17A–5–12, బంగారు వారి చెరువు గట్టు, పాలకొల్లు, పాలకొల్లు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు డిక్రీ బాకి అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టర్ హాజరు నిమిత్తం ది.03–12–2025 సం॥తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
న్యాయవాది, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.
పాలకొల్లు
తేది.28–11–2025